



యనమలకుదురులో శివరాత్రికి గ్రామస్తులు సిద్ధం చేస్తున్న ప్రభ



బెజవాడ ఇంద్రకీలాద్రిపై కాంతులీనుతున్న శివాలయం

శివపూజకు వేళాయె!

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో మహాశివరాత్రి ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. విద్యుత్ కాంతులతో శివాలయాలు ధగధగలాడుతున్నాయి. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అధికారులు భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద బారికేడ్లు పెట్టారు. యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులకు ఏర్పాటు చేశారు. గ్రామంలో 50కి పైగా ప్రభలను ముస్తాబు చేశారు.

మచిలీపట్నం పోర్టు పనులు ఎన్నికల స్టంట్‌గా మారాయా? ఎన్నికలకు ఏడాది ముందు పోర్టు పనులు ప్రారంభించి అధికార పార్టీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారా? అనే సందేహాలు వస్తున్నాయి. మచిలీపట్నం పోర్టు నుంచి సరుకుల ఎగుమతులు, దిగుమతులకు కీలకమైన బెర్తుల నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పోర్టు పనులు కొనసాగుతాయా లేక నిలిచిపోతాయా అనే చర్చ జరుగుతోంది. గడిచిన తొమ్మిది నెలల్లో కేవలం 15 శాతం పనులు మాత్రమే పూర్తవడం గమనార్హం.

- 16 బెర్తులకు బదులుగా 4 బెర్తులతో బందరు పోర్టు నిర్మాణ పనులు
- తొమ్మిది నెలల్లో చేసింది 15 శాతం పనులే
- 30 నెలల్లో పూర్తిచేయాలని ఒప్పందం
- పోర్టు పూర్తికాకుండానే అనుబంధ పరిశ్రమల కోసం భారత్‌సాల్ట్ భూములు కావాలని నోటీసులు



పోర్టు వద్ద పిల్లర్ల పనులు

పోర్టు పనులు ఎప్పటికో..!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టును 16 బెర్తులతో నిర్మించాలి. ఇందుకోసం రూ.11,994 కోట్లకుపైగా వినియోగించాలి. అంత పెద్దమొత్తంలో నిధలను సమకూర్చకుండా వ్యూహాత్మకంగా అధికారపార్టీ నాయకులు పోర్టు పనులను రెండు ఫేజ్‌లుగా విభజించారు. మొదటి ఫేజ్‌లో రూ.3,683.83 కోట్లతో నాలుగు బెర్తులతో పనులు చేయాలని నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ సంస్థ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పోర్టు నిర్మాణం కోసం రుణం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకుండానే రుణం తీసుకున్న నగదుతో పోర్టు పనులను ప్రారంభించారు. గత ఏడాది మేలో పనులు ప్రారంభించగా ఇప్పటివరకు రూ.350 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 15 శాతం పనులు మాత్రమే జరిగాయి. నాలుగు బెర్తుల నిర్మాణంలో భాగంగా ఒక్కో బెర్తుకు 300 పిల్లర్ల చొప్పున 1200 పిల్లర్లు నిర్మించాలి. ఈ పిల్లర్లు 200 అడుగుల లోతు నుంచి నిర్మించాలి. ఇప్పటివరకు మూడు బెర్తులకు సంబంధించి 250 పిల్లర్ల పనులే ప్రారంభించారు. నాలుగో బెర్తుకు పిల్లర్లు పోసే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఫిబ్రవరి నెలాఖరుకు ఒకటో నెంబరు బెర్తు పనులకు పిల్లర్లు పోసే పనులు పూర్తిచేస్తామని, జూన్ నెలాఖరు నాటికి పిల్లర్లపై బీమ్‌లువేసి, శ్లాబ్ పనులు పూర్తి చేస్తామని చెప్పినా అనుకున్న స్థాయిలో పనులు జరగడం లేదు.

డ్రెడ్జింగ్ పనుల ప్రారంభం ఎప్పుడో

సముద్రంలో నుంచి పోర్టు వరకు ఓడల రాకపోకల కోసం డ్రెడ్జింగ్ పనులు చేయాలి. ఓడల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన టర్నింగ్ సర్కిల్‌కు సమీపంలో మంగళవారం నాటికి నాలుగు డ్రెడ్జర్లను తీసుకువచ్చి సముద్రంలో నిలిపి ఉంచారు. వీటి ద్వారా పనులు ఎప్పటికి ప్రారంభిస్తారో తెలియదు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారపార్టీ నాయకుల సూచనలతో ఈ డ్రెడ్జర్లను తీసుకువచ్చి హడావుడి చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పోర్టు వద్ద సౌత్‌బ్రేక్‌వాటర్, నార్త్ బ్రేక్‌వాటర్‌కు మధ్య 450 మీటర్ల మేర ఉన్న ఖాళీలో నుంచి 80వేల టన్నుల సామర్థ్యంతో సరుకులతో ఉన్న ఓడలు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఓడల రాకపోకల కోసం 20 మీటర్ల లోతున మట్టిని డ్రెడ్జింగ్ చేయాలి. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

అరకొరగా బ్రేక్ వాటర్ పనులు

పోర్టు పనులు కొంతమేర జరిగాయంటే అవి సౌత్, నార్త్ బ్రేక్‌వాటర్‌ల తొలిదశ పనులే. సౌత్ బ్రేక్‌వాటర్ నిర్మాణం 2,050 మీటర్లమేర జరగాలి. ఇప్పటివరకు 1900 మీటర్ల పనులు జరిగాయి. నార్త్‌బ్రేక్ వాటర్ నిర్మాణం 270 మీటర్లు. రెండు బ్రేక్ వాటర్ నిర్మాణాలకు తొలివిడత పనులు పూర్తయ్యేదశలో ఉన్నాయి. ఈ రెండు బ్రేక్‌వాటర్‌ల తొలిదశ పనులను పరిశీలించి మరింతగా పటిష్టవంతంగా నిర్మించేందుకు చెన్నయ్‌కు చెందిన ట్రిపుల్‌ఐటీ నిపుణులకు బాధ్యతలను అప్పగించారు. వారు ఈ రెండు బ్రేక్‌వాటర్‌ల తొలివిడత నిర్మాణం పనులు పూర్తయిన తరువాత పరిశీలన చేసి, ఇక్కడి సముద్రంలో అలల ఉధృతి, ఇతర పరిస్థితులపై అధ్యయనం చేసి దీర్ఘకాలంపాటు బ్రేక్‌వాటర్‌లు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఇది అందిన తరువాత మళ్లీ బ్రేక్ వాటర్‌లను పటిష్టం చేయడం, వీటి ఎత్తు పెంచడం వంటి పనులు చేయాలి.

భూ బాధితులకు పరిహారం ఇవ్వని ప్రభుత్వం

మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి 65, కత్తిపూడి-ఒంగోలు 216-ఏ జాతీయ రహదారులకు, మచిలీపట్నంలోని రైలు మార్గానికి అనుసంధానం చేస్తూ పోర్టు నుంచి రోడ్‌కం రైలు మార్గాన్ని నిర్మించాలి. రోడ్డు కంరైలు మార్గాల నిర్మాణం కోసం 280 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఈ భూములను రైతుల నుంచి తీసుకున్నారు. కానీ రైతులకు ఇవ్వాల్సిన నగదును ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. కరగ్రహారం నుంచి మేకావానిపాలెం వరకు ముందస్తుగా భూములిచ్చిన రైతులకు తొలి విడతగా అసైన్డ్ భూములకు ఎకరానికి రూ.31.25 లక్షలు చొప్పున, పట్టా భూములకు రూ.45లక్షలు చొప్పున నగదు జమచేశారు. మరికొందరు రైతులకు భూ పత్రాలు సక్రమంగా లేవనే కారణంతో వారికి నగదు జమచేయలేదు. మంగినపూడి బీచ్ రోడ్డులో పోర్టు పాత శిలాఫలకం నుంచి పోతేపల్లి వరకు రోడ్‌కం రైలు మార్గాలకు భూములిచ్చే రైతులకు రూ.55లక్షలు ఇస్తామని అధికారులు అంగీకరించినా, రైతులకు నగదు జమచేసే అంశంపై సాంకేతికపరమైన కారణాలు చూపి ఇంతవరకు నగదు జమ చేయలేదు. పోర్టు పనులు ఒకవైపు నత్తనడకన సాగుతుండగా పోర్టు అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం మరో రెండువేల ఎకరాలు అవసరమని చెప్పి పల్లెతుమ్మలపాలెంలోని భారత్‌సాల్ట్ భూములను తీసునేందుకు ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం గమనించదగ్గ అంశం.



మాజీ ఎమ్మెల్యే వంశీ కవ్వింపు చర్యలతో ఎనికేపాడు వద్ద ఉద్రిక్తత

రెచ్చగొట్టి రణరంగం

ఎనికేపాడులో ఉద్రిక్త వాతావరణం

వైసీపీ దాడులను నిరసిస్తూ టీడీపీ-జనసేన దీక్ష

యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శాంతియుత నిరసన

దీక్షా శిబిరం వద్దకు వచ్చి మాజీ ఎమ్మెల్యే వంశీ కవ్వింపు

ఒక్కసారిగా బయటకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు

అడ్డుకున్న పోలీసులు.. తిరగబడిన కార్యకర్తలు..

వంశీ వెళ్లిపోవడంతో శాంతించిన వాతావరణం

కావాలని కవ్వింపు చర్యలకు పాల్పడటం.. రెచ్చగొట్టి తమాషా చూడటం.. చివరికి ఎదురెళ్లి దాడులు చేయడం.. గన్నవరంలో టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేస్తున్న అరాచకాలివి. తమపై దాడులను నిరసిస్తూ గురువారం టీడీపీ-జనసేన శ్రేణులు చేపట్టిన నిరసన దీక్షలోనూ వంశీ, ఆయన అనుచరుల వింత వైఖరి, వారికి వంత పాడుతూ పోలీసులు చేసిన హడావిడితో శాంతియుత దీక్షా ప్రాంగణం రణరంగంలా మారింది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ/గుణదల) : గన్నవరంలో టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చర్యలను నిరసిస్తూ గురువారం ఎనికేపాడులో పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్ల కండువాలు ధరించి పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొనగా, ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరులతో పాటు పోలీసులు ప్రవర్తించిన తీరు ఘర్షణకు దారితీసింది. శిబిరంలో నాయకుల ప్రసంగాలు కొనసాగుతుండగా, ఆకస్మికంగా పెద్ద సంఖ్యలో పోలీసులు వచ్చారు. భద్రతా దళాలు శిబిరం వద్దకు చేరుకోవడం రోప్ పార్టీ సైతం చకచకా ఏర్పాట్లు చేస్తుండటంతో కార్యకర్తలు, నాయకులు ఏదో జరుగుతోందని, దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. పోలీసులు శిబిరం వద్ద హడావిడి చేసిన కొద్దిసేపటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ, తన అనుచరులతో ఐదు కార్లలో శిబిరం వద్దకు చేరుకున్నారు. శిబిరం ముందు నుంచి వెళ్లిన ఆయన తన కారును యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చారు. రోడ్డుకు అవతల పక్కన కార్లను ఆపి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వంశీని పోలీసులు నిలువరించే ప్రయత్నం చేయలేదు. (మిగతా 6లో)



గొల్లమంద వద్ద దాదాపు 70 మీటర్ల మేర కోసుకుపోయిన రివర్ బ్యాంక్

కోతలే..

ఎదురుమొండి దీవుల కోత సమస్య తీవ్రం

వైసీపీ పాలనలో హామీలు తప్ప ఆచరణ శూన్యం

అంచనాల్లో మార్పులు తప్ప కేటాయింపుల్లేవ్

అవనిగడ్డ : నియోజకవర్గంలోని దీవి గ్రామాల సమూహమైన ఎదురుమొండి దీవులకు ఎదురైన కోత సమస్యకు ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం లభించడం లేదు. వైసీపీ పాలనలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాల వల్ల నదీ గర్భంలో ఏర్పడిన మార్పులు ఎదురుమొండి దీవికి కోత ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. ఇప్పటికే ఎదురుమొండి దీవిలోని పలు ప్రాంతాలు కోతకు గురయ్యాయి. గొల్లమంద వద్ద ఈ సమస్య అత్యంత ప్రమాదకరంగా మారింది.

● హామీని అటకెక్కించిన ఎమ్మెల్యే

గత ఐదేళ్లలో 70 మీటర్లు నది కోతకు గురై నేడు గొల్లపాలెం వెళ్లే రహదారిని కూడా మింగేసే విధంగా తయారైంది. లంక భూమిని కృష్ణా బ్యాక్ వాటర్ తనలో కలిపేసుకోగా, ఇప్పుడు రహదారి కూడా కరగడం మొదలైంది. స్థానికులు 2021లోనే ఈ సమస్యను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ మరమ్మతులు చేయించి కోత నివారిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మాటలకే పరిమితమైంది. రూ.80 లక్షల్లో ఈ పని పూర్తవుతుందని ప్రకటించి ఇదిగో మరమ్మతులు చేస్తున్నాం... అదిగో మరమ్మతులు చేస్తున్నాం అని కాలం గడిపారు. సమస్య అధికంగా ఉండటంతో అంచనాలను పెంచాల్సి వస్తుందని రూ.4 కోట్లతో అంచనాలను రూపొందించారు. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించలేదు.

● కలెక్టర్ విన్నవించినా ఫలితం శూన్యం

రోడ్డు వరకు నది కోసుకుపోయిందని, రోడ్డును మింగేస్తూ వస్తోందని గత సంవత్సరం ఆగస్టు నెలలో ఈ ప్రాంతానికి వచ్చిన కలెక్టర్ రాజబాబుకు స్థానికులు విన్నవించారు. దీనిపై అధికారులను జిల్లా కలెక్టర్ వివరణ కోరగా, తాము ముందుగా వేసిన అంచనాలకు ఈ పనులు పూర్తి కావని, రూ.7 కోట్లు మంజూరు చేస్తే గానీ సమస్యను పరిష్కరించలేమని చెప్పటంతో అందుకు తగ్గట్టుగా అంచనాలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

● ముందుకు కదలని అంచనాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.7 కోట్లతో రివర్ బ్యాంక్ మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించగా, ఆ అంచనాలు కనీసం ఫైళ్ల దశలో దాటలేదు. ఎమ్మెల్యే, కలెక్టర్, ఎంపీలకు ఎన్నోసార్లు ఈ సమస్యపై వివరించామని, అయితే ఎప్పటికప్పుడు అంచనాల పేరుతో వారు తమను మభ్యపెడుతూ వచ్చారు తప్ప సమస్యను పరిష్కరించటానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

అటు.. ఇటు..!

- మచిలీపట్నం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్
- అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా సింహాద్రి రమేష్

అవనిగడ్డ, మార్చి 7 : అవనిగడ్డ అసెంబ్లీ, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం తారుమారు చేసింది. అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా మార్పు చేసింది. తొలుత అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. కారణాలు ఏవైతేనేం అభ్యర్థిని మార్చాల్సి వచ్చింది. గురువారం సాయంత్రం తాడేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ చంద్రశేఖర్‌ను ఎంపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించినట్టు తెలిపారు. డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు తండ్రి సింహాద్రి సత్యనారాయణరావు మూడుసార్లు అవనిగడ్డ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పని చేశారని, మచిలీపట్నంతో డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, వారి కుటుంబానికి విడదీయలేని అనుబంధం ఉందని, 35 ఏళ్లుగా ఆయన అంకాలజిస్టుగా ప్రజలకు వైద్య సేవలందించారని చెప్పారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ తనను అవనిగడ్డ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని అవకాశమిచ్చారని, తాను అసెంబ్లీకి పోటీ చేయనని చెప్పానని, సీఎం జగన్ తనను పిలిపించి ఎంపీగా పోటీ చేయాలని కోరారని చెప్పారు.



సింహాద్రి చంద్రశేఖర్

అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా రమేష్



సింహాద్రి రమేష్

అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును నియమిస్తూ ఆ పార్టీ గురువారం ప్రకటన జారీ చేసింది. మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి చంద్రశేఖర్, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రమేష్‌బాబు ఒకే అవనిగడ్డ నియోజకవర్గంవారే కాక ఒకే గ్రామం అయిన బందలాయిచెరువుకు చెందివారు. పైగా ఇద్దరూ సమీప బంధువులు కావడం గమనార్హం.

పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వర స్వామి

కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

● కృష్ణానదిలో ఘాట్ల వద్ద పడవలు ● గజ ఈతగాళ్లు సంసిద్ధం - 6లో..





చాందిని టెంట్లతో డెకరేషన్ చేసిన దుర్గానాగేశ్వరస్వామి ఆలయం

పెదకళ్లేపల్లిలో దుర్గా నాగేశ్వర స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మోపిదేవి, మార్చి 7 : మహాశివరాత్రి పురస్కరించుకుని దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కళ్యాణోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. పలు ప్రాంతాలనుంచి లక్షమందికిపైగా భక్తులు వస్తారని అంచనా. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గజ ఈతగాళ్లు, పడవలు ఏర్పాటుచేసి నిరంతరం ఘాట్లవద్ద గస్తీ ఉండేలా ఏర్పాట్లు చేశారు. మచిలీపట్నం డీఎల్‌పీవో జ్యోతిర్మయి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీవిద్యల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య చర్యలు వేగవంతం చేశారు. రహదారుల వెంబడి బ్లీచింగ్, ఘాట్ల వద్ద శానిటేషన్ చర్యలు చేపట్టారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక గదులు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. దుర్గానాగేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు అందించనున్నట్టు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, చల్లపల్లి అవనిగడ్డ సీఐలు నాగప్రసాద్, త్రినాథ్‌ల ఆధ్వర్యంలో 250మంది పోలీసు సిబ్బందిచే బందోబస్తు నిర్వహించనున్నారు.

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డులో ప్రధాన అర్చకునికి దక్కని చోటు!

వన్‌టౌన్, మార్చి 7 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డుకు సభ్యులను నియమించే క్రమంలో ప్రధాన అర్చకుడికి చోటు కల్పించలేదు. గతేడాది వైసీపీ ప్రభుత్వం తొలుత కర్నాటి రాంబాబు అధ్యక్షతన 15మంది సభ్యులను నియమించింది. తొలిజాబితాలో ప్రధాన అర్చకుడి పేరును విస్మరించారు. ఇటీవల ముగ్గురిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. మూడు రోజుల క్రితం ఒక ప్రత్యేకఆహ్వానితుడు, ఒక సభ్యుడిని నియమించారు. ట్రస్ట్‌బోర్డులో ప్రధాన అర్చకుడికి కూడా స్థానం కల్పించే సంప్రదాయం కొనసాగుతుంది. ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్ గతంలో మూడు పర్యాయాలు దేవస్థానం తరఫున ప్రతినిధిగా కొనసాగారు. బద్రీనాథ్‌బాబుపై కొన్ని ఆరోపణలు ఉండటంతో ఆయనను పక్కన పెట్టారు. మరొక ప్రధాన అర్చకుడు సుందరం తనకు బోర్డులో సభ్యత్వం అవసరం లేదని రాసి ఇచ్చినట్టు సమాచారం. ట్రస్ట్‌బోర్డు సమావేశాలల్లో వైదిక కార్యక్రమాలు, ఉత్సవాలను గురించి తీర్మానాలు చేసేటపుడు సలహాలు ఇచ్చేందుకు దేవస్థానం తరఫున ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉంది. వీరిని ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు. మరోవైపు తీర్మానాలు ఆమోదం కావాలంటే కోరం ఉండటంతో పాటు ఓటింగ్ సమయంలో కూడా ఎక్స్ అఫిషియో సభ్యుడి అవసరం ఉంటుంది. ప్రత్యేక ఆహ్వానితులకు ఓటు ఉండదు. ట్రస్‌బోర్డులో ప్రస్తుతం 16 మంది సభ్యులు ఉన్నారు.

సుస్థిర ఆర్థిక సాధికారతకు చేయూత

» నాలుగో విడతగా రూ.179.17 కోట్ల లబ్ధి : జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక, మార్చి 7 : మహిళలకు ఆర్థిక సహకారం అందించి, ఆపై సుస్థిర జీవనోపాధి మార్గాలను చూపి వారికి సాధికారిత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలుచేస్తోందని జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, పిసినికాడలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శివరామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. లబ్ధిదారులకు మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మహిళల సమగ్రాభివృద్ధి, సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తోందని తెలిపారు. నాలుగో విడతలో జిల్లాకు సంబంధించి 95556 మందికి రూ.179.17 కోట్ల మేర లబ్ధి జరుగుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ జె.సునీత లబ్ధిదారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మిజోరం గవర్నర్

లయోలలో ఘనంగా ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు

భారతీనగర్ : ఆంధ్రాలయోలా కళాశాల స్థాపించి 70 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాలలో ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు గురువారం హాకీ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి, మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంభంపాటి మాట్లాడుతూ, భవిష్యత్తును మెరుగుపరచడం కోసం సాంకేతికతను ఉపయోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి శాస్త్రీయ నృత్యం, తెలుగు జానపద నృత్యం చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం 2005, 2016లో పద్మశ్రీ అవార్డులు అందుకున్న ప్రొఫెసర్ భాగవతుల దత్తగురు, డాక్టర్ వై.నాయుడమ్మను కళాశాల ప్రిన్సిపల్స్ సత్కరించారు. ప్రిన్సిపల్ ఫాదర్ కిషోర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.సహాయ భాస్కరన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిరైతుల అభివృద్ధి చలసాని సేవలు భేష్

» తానా కార్యదర్శి కసుకుర్తి రాజా


హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7 : పాడి రైతుల సర్వతోముఖాభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అందిస్తున్న సేవలు నిరుపమానమని తానా కార్యదర్శి కసుకుర్తి రాజా అన్నారు. వీరవల్లిలోని విజయ(కృష్ణామిల్క్ యూనియన్)పాల ఉత్పత్తుల నూతన ప్యాక్టరీని గురువారం ఆయన సందర్శించారు. అత్యాధునిక సాంకేతికత, నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్న పాల ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. వీరవల్లి ప్రాంతంలో ఫ్యాక్టరీ స్థాపించడం గ్రామవాసిగా గర్వపడుతున్నానని కసుకుర్తి రాజా తెలిపారు. తనవంతు సహకారంగా.. తానా ద్వారా పాడిరైతులకు సాంకేతిక సహకారంతో పాటు మినీడెయిరీల ఏర్పాటుకు సహకారమందిస్తామని రాజా హామీ ఇచ్చారు. అనంతరం చలసాని ఆంజనేయులు రాజాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.



తానా కార్యదర్శి కసుకుర్తి రాజాను సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

పీజీ పరీక్షలు వాయిదా

పెదకాకాని, మార్చి 7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.



మహా శివరాత్రికి ముస్తాబు

- నేడు యనమలకుదురు రామలింగేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం
- గ్రామంలో 50కి పైగా ప్రభల ఏర్పాటు
- వేలాదిగా భక్తులు హాజరవుతారని అంచనా
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసు శాఖ

పెనమలూరు, మార్చి7 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శుక్రవారం నాడు ఆలయంలో రామలింగేశ్వరస్వామి, పార్వతీ దేవి అమ్మవార్ల కళ్యాణం కన్నుల పండువగా జరగనుంది. గ్రామంలో ఏభైకి పైగా ప్రభలను ఏర్పాటు చేశారు. లక్షమందికి పైగా భక్తులు హాజరయ్యే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఐదుగురు డీఎస్పీలు, 12మంది సీఐలు, 30మంది ఎస్‌ఐలు, ఐదువందల మందికిపైగా సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్టు అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గన్నవరం డీఎస్పీ స్వయంగా భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. గురువారం దుర్గామల్లేశ్వరస్వామి ఈవో కేఎస్ రామారావు, ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

నేటి కార్యక్రమ వివరాలు

శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాల అనంతరం బిల్వార్చన, పార్వతీ దేవికి కుంకుమ పూజ నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు గ్రామ మంటపం వద్ద దేవస్థాన ప్రభకు ఎడ్లు కట్టి ఊరేగించేందుకు పాట కార్యక్రమం నిర్వహిస్తారు. మధ్యాహ్నం నుంచి రాధాకృష్ణ కోలాటాలు, భజనలు కోయనృత్యాలు, బేతాళ వేషాలు, హిరాణి నృత్యాలు, మేళతాళాలతో గ్రామ ప్రభను అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 2.25గంటలకు రావి ఉదయకిరణ్, దీప్తి దంపతులచే కళ్యాణం నిర్వహిస్తారు.

దుర్గా ఘాట్ల వద్ద పటిష్ట ఏర్పాట్లు

పరిశీలించిన దుర్గగుడి ఈవో రామారావు

వన్‌టౌన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కృష్ణానదిలో స్నానాలు చేసేందుకు అత్యధిక సంఖ్యలో వచ్చే భక్తు కోసం దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, పోలీసు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు తరలిరానున్నారు. బ్యారేజీ దిగువన స్నానాలకు నదిలో నీరు లేకపోవడంతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. దుర్గాఘాట్‌లోకి విస్తృతంగా భక్తులు దిగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రముఖ పాత శివాలయంగా పేరున్న భ్రమరాంబ మల్లేశ్వలరాలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో రానున్న దృష్ట్యా ప్రత్యేక క్యూలను దేవస్థానం ఏర్పాటు చేసింది. మరోవైపు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయాన్ని పునరుద్దరించి ఇటీవలే భక్తులను అనుమతించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా. శివాలయాలలో వేకువ జామునుంచే అభిషేకాదులను ప్రారంభించనున్నారు. ఘాట్ల వద్ద పరిస్థితిని దుర్గగుడి ఈవో రామారావు స్వయంగా పరిశీలించారు. ఇదే క్రమంలో ఘాట్ల వద్ద, ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం అన్ని ఘాట్ల వద్ద వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 300 మంది. భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో 65 మంది. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని ఘాట్ల వద్ద 25 మందిని నియమించారు.



దుర్గాఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో రామారావు

రెచ్చగొట్టి రణరంగం

(5వ పేజీ తరువాయి)

వంశీ కవ్వింపు చర్యలతో ఆగ్రహానికి గురైన శిబిరంలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బయటకు వచ్చే ప్రయత్నం చేశారు. అప్పటి వరకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. శిబిరం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు టీడీపీ, జనసేన కార్యకర్తలను శిబిరం నుంచి బయకు రాకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కవ్వింపు చర్యలకు పాల్పడ్డ వంశీకి మద్దతుగా వస్తారా.. అంటూ కార్యకర్తలు పోలీసులకు ఎదురుతిరిగారు. యార్లగడ్డ వెంకట్రావు జోక్యం చేసుకుని టీడీపీ, జనసేన శ్రేణులను శాంతపరిచి దీక్ష కొనసాగించారు. వంశీ, ఆయన అనుచరులను పోలీసులు అక్కడి నుంచి పంపించివేశారు. నిరసన దీక్ష శాంతియుతంగా జరుగుతుండగా, పోలీసుల సహకారంతో వంశీ కవ్వింపు చర్యలకు పాల్పడటం చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం వ్యక్తమవుతోందంటూ కార్యకర్తలు పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు.

దాడులు కొనసాగితే ఆత్మరక్షణకు దిగుతాం : యార్లగడ్డ వెంకట్రావు

టీడీపీ శ్రేణులపై దాడులు చేస్తున్న వైసీపీ నాయకులను వదిలేసి బాధితులపై పోలీసులు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు అండగా ఉంటూ దాడులను ప్రోత్సహిస్తున్న పోలీసులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైసీపీ నేతల ఆరాచకాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. పాము కన్నా ఎక్కువ విషం ఉన్న వ్యక్తి వంశీ అని, తాము దీక్ష చేసే చోట ఆయనకేం పని అని ప్రశ్నించారు. ఓటమి భయంతోనే దాడులు, కవ్వింపు చర్యలకు తెగబడుతున్నారని ఆరోపించారు. 'నేను జగన్‌తో కలిసి నడిచా. అన్యాయం చేశారనే బయటికి వచ్చా. వచ్చే ఎన్నికల్లో గన్నవరంలో టీడీపీ విజయం ఖాయం. మమ్మల్ని అన్యాయంగా ఇబ్బంది పెట్టిన వారి లెక్కలు సరిచేస్తాం' అని హెచ్చరించారు. ఎన్నికల్లో పోలీసులు మాపై దాడులు ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే మాపైకి వచ్చిన వారిపై ఆత్మరక్షణ కోసం తామే ప్రతి దాడులు చేస్తామన్నారు. ఈ నిరసన దీక్షలో టీడీపీ నాయకులు గొడ్డళ్ల చినరామారావు, గూడవల్లి నరసయ్య, కొల్లా ఆనంద్, సర్నాల బాలాజీ, కోనేరు శివరామకృష్ణ, కోనేరు సందీప్, గుజ్జర్లపూడి బాబూరావు, చాగంటిపాటి వెంకటకృష్ణ, ఆళ్ల గోపాలకృష్ణ, చలమలశెట్టి రమేష్, పొదిలి లలిత, చిక్కవరపు నాగమణి, తుపాకుల శివలీల, జూపల్లి సురేష్, దండు సుబ్రమ్మణ్యరాజు, అద్దేపల్లి సాంబు, బోడపాటి రవికుమార్, పరుచూరి నరేష్, మూల్పూరి సాయికల్యాణి, మండవ లక్ష్మి, మండవ రమ్య, జాస్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 7 : నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంపై ఎన్నికల ప్రక్రియ, ఈసీఐ మార్గదర్శకాలపై రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి వుండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల లోకేషన్ మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కేంద్రాల పేర్ల మార్పు తదితర అంశాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు సంబంధించి ప్రతిపాదనలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి వారి ఆమోదంతో ఎన్నికల సంఘానికి పంపడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రస్తుతమున్న పోలింగ్ స్టేషన్లలో 39 పోలింగ్ స్టేషన్ల లోకేషన్ మార్పు, 286 పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పు (నామెన్ క్లేచర్), 11 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్‌కు పంపించడం జరుగుతుందన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించిన నాటినుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో వుంటుందన్నారు. రాజకీయ పార్టీలు పాటించవలసిన విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు వ్యయ పరిమితిని ఎన్నికల కమిషన్ విధించిందన్నారు. పోటీలో వున్న అభ్యర్థులు ప్రతిరోజు వ్యయానికి సంబంధించిన నివేదికలను సమర్పించవలసి వుంటుందన్నారు. ప్రతి అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి వుంటుందన్నారు. ప్రచారం, నామినేషన్లు దాఖలు చేసేందుకు వాహనాల వినియోగంపై పరిమితి వుందన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో అభ్యర్థుల ప్రచారానికి ఎంసీఎంసీ నుంచి అనుమతి పత్రం తప్పనిసరన్నారు. రాజకీయ పార్టీలు నేరచరిత్ర లేని అభ్యర్థులను మాత్రమే ఎలక్షన్, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అవగాహన కల్పించుకొని నిష్పక్షపాత, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, బ్యాలెట్ పేపర్ నోడల్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, శిక్షణ కార్యక్రమాల నోడల్ ఆఫీసర్ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్, ఎం.వినోద్‌కుమార్, కె.పి.దాస్ (బీఎస్పీ), డీవీ కృష్ణ, ఎస్.రమేష్ బాబు (సీపీఎం), వై.రామయ్య, బి.అనిల్ (తెదేపా), షేక్ కరీం (బీజేపీ), కె.పరమేశ్వరరావు (ఆప్), బుర్రా కిరణ్, అశోక్ శరన్ (ఐఎన్‌సీ), వై.అంజనేయరెడ్డి, అప్సర్ మహ్మద్, వి.యశోధర్ (వైసీపీ), ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

10న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

వన్‌టౌన్, మార్చి 7 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ప్రవేశపరీక్ష ఈనెల 10న నిర్వహించనున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లాల సమన్వయ అధికారిణి బి.సమిత్రాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు అర్హత పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు 10వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లాలో ఆరు కేంద్రాల్లో 712 మంది ఐదోతరగతి ప్రవేశపరీక్ష, 1022 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు కేంద్రాల్లో 5వతరగతి ప్రవేశపరీక్షకు 1662 మంది, మొదటి సంవత్సరం ఇంటర్‌ప్రవేశపరీక్షకు 1733మంది హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఆరగంట ముందుగా చేరుకోవాలన్నారు.



నివాళులు అర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర

మాజీ మునిసిపల్ చైర్మన్ ముత్యాల వెంకటాచలం మృతి

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మాజీ మునిసిపల్ చైర్మన్ ముత్యాల వెంకటాచలం (55) హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొద్ది సంవత్సరాలుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధ పడుతున్న ఆయన హైదరబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల పరిస్థితి విషమించటంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. ఆయన 2006 నుంచి ఐదేళ్ల పాటు వైస్‌చైర్మన్‌గా, ఆర్నెల్లు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా పని చేశారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్‌లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, అధికారులు చలం చిత్రపటానికి నివాళులు అర్పించి, సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, ఎంపీ కేసినేని నానిలు నివాళులు అర్పించారు.

రంజాన్‌కు మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

» కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం టౌన్, మార్చి 7 : రంజాన్ మాసంలో మసీదులకు వచ్చే ముస్లిం సోదరులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశంచారు. గురువారం స్పందన హాలులో పవిత్ర రంజాన్ సందర్భంగా జిల్లాలో జరిపే ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. నెలవంక కనిపించినప్పటినుంచి రంజాన్ మాసం మొదలవుతుందని, ఉపవాసాలు ఉండే ముస్లిం సోదరులకు మసీదుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముస్లిం మైనారిటీ నాయకులు, దర్గాల వద్ద ఉండే మతపెద్దల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో చంద్రశేఖరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షంసున్నీసా, డీఆర్‌డీఏ ప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అచ్చాబా, పలువురు మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రంజాన్‌పై జరిగిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ రాజాబాబు



ఎన్టీఆర్ జిల్లా నోడల్ ఆఫీసర్ల నియామకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల నిర్వహణకు అత్యంత కీలకమైన నోడల్ ఆఫీసర్ల నియామకాలను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. ఇప్పటికే కొంత మంది ఆఫీసర్లను నియమించిన జిల్లా ఎన్నికల యంత్రాంగం త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్న తరుణంలో కీలక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నోడల్ ఆఫీసర్లందరినీ నియమించింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో 16మంది నోడల్ ఆఫీసర్లను జిల్లా యంత్రాంగం నియమించింది. వీరు మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, ట్రెయినింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, స్వీప్, లా అండ్ ఆర్డర్, ఈవీఎం మేనేజ్‌మెంట్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ), ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, బ్యాలెట్, మీడియా మానిటరింగ్, కమ్యూనికేషన్, ఎలక్టోరల్ రోల్స్, ఓటర్ హెల్ప్‌లైన్, అబ్జర్వర్స్‌గా విధులను ఆయా నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారు. వీరు ఎన్నికల విధుల్లో పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేయడం, జిల్లావ్యాప్తంగా పోలింగ్, కౌంటింగ్, ఇతర ప్రక్రియలకు సంబంధించి ఎప్పటి కప్పుడు అంచనా వేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు మెటీరియల్‌ను సిద్ధం చేయడం.. మెటీరియల్ ప్రొక్యూర్‌చేయటం నుంచి వాటిని సరఫరా చేసేవరకు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. రవాణా సదుపాయాలన్నింటినీ చూసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వెబ్‌సైట్‌కు అనుసంధానించాల్సిన డేటా మానిటరింగ్‌తో పాటు, వెబ్‌సైట్ల ఫంక్షనింగ్, యాప్స్‌ల పనితీరు, అవవసరమైన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ వంటివి సన్నద్ధం సిస్టమ్స్ ట్రబుల్ షూటింగ్స్, మానిటరింగ్ వంటి వ్యవహారాలను పర్యవేక్షిస్తారు.

జిల్లాస్థాయిలో ఓటర్ల నమోదు అవగాహనా కార్యక్రమాలు, పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృత కార్యక్రమాచేపడతారు. శాంతిభద్రతలపై దృష్టి సారించి బలగాలు ఎక్కడ అవసరమో గుర్తించాలి. జిల్లాలో ఈవీఎంలు, వీవీప్యాట్స్ వంటివి పర్యవేక్షించటంతో పాటు ఫస్ట్‌లెవల్ చెకింగ్, వాటి భద్రత, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్వీసింగ్, బీఈఎల్, ఈసీఐఎల్ కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవటం, ఈవీఎంల పర్యవేక్షణ, లీగల్ అంశాలన్నింటినీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అధికారులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నేతలు, మీడియా సంస్థలు, ప్రతినిధులు పనిచేస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించి ఉల్లంఘనలు జరిగితే తక్షణం చర్యలు తీసుకోవటానికి సిద్ధం కావటం, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై విచారణ జరపటం వంటివి పర్యవేక్షిస్తారు. అధికారులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పెట్టే ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేస్తు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్స్ నుంచి ఎప్పటి కప్పుడు సమాచారాన్ని తెప్పించుకుని రిపోర్టులు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి స్టోరేజ్‌పాయింట్లకు, అదేవిధంగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు రవాణా వంటివి చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు అందించటం, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించటం, మీడియాను పర్యవేక్షిస్తుండాలి. పత్రికల్లో పెయిడ్ న్యూస్‌కు సంబంధించి నిఘా ఉంచటం, సోషల్ మీడియాలో నిఘా ఉంచటం వంటివి చూడాల్సి ఉంటుంది. ఈసీఐ వెబ్‌సైట్‌కు అప్‌లోడింగ్ బాధ్యతలను పర్యవేక్షంచాలి. ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్స్ (ఈఆర్ఓ)లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఎస్ఆర్ పర్యవేక్షణ, ఓటరు జాబితాల రూపకల్పన, ఓటరు కార్డుల ముద్రణ తదితర కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్, టెలిఫోన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదు చేయాలి. అలాగే ఓటరు హెల్ప్‌లైన్ నెంబర్ 1951 ద్వారా వచ్చే ఫిర్యాదుల పైనా దృష్టి సారించాల్సి ఉంటుంది. అబ్జర్వర్లు సూచించిన అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయిస్తుండాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

శివరాత్రికి రామలింగేశ్వరస్వామి ఆలయం సిద్ధం



గన్నవరం, మార్చి 7: ముస్తాబాదలోని భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి గుహాలయం మహాశివరాత్రి మహోత్సవానికి సిద్ధమైంది. రామలింగేశ్వర స్వామికి శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, ఏకాదశ ఫల పంచామృత, సుగంధ ద్రవ్యాలతో వివిధ అలంకారాలతో పాటు విశేష అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. 9గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, నీరాజన, మంత్రపుష్ప, తీర్థప్రసాద వితరణ ఉంటుందని, సీతారామాంజనేయస్వామి భజన సమాజం వారితో శివనామ స్మరణ భజన, కూచిపూడి నాట్య ప్రదర్శనలు, రాత్రికి జ్యోతులతో గిరిప్రదక్షిణ, మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొంది. అర్ధరాత్రి స్వామి దివ్యశాంతి కల్యాణ మహోత్సవం, దివ్య అలంకార దర్శనం ఉంటుందని, మధ్యాహ్నం 10వేల మందికి అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశామని కమిటీ తెలిపింది.

వైసీపీకి తొత్తులుగా పోలీసులు

● అలా వ్యవహరించడం దుర్మార్గం: ముప్పా రాజా

కంకిపాడు, మార్చి 7: "జనసేన పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఇళ్లకు వెళ్లి పోలీసులు దౌర్జన్యం చేసి ఎటువంటి ఆర్డర్స్ లేకుండా సోదాలు చేసి, రివాల్వర్ చూపించారు. ఇలా చేయడం సరికాదు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు వైసీపీకి తొత్తులుగా పనిచేయడం దుర్మార్గం. పోలీసులు వైసీపీకి పని చేస్తున్నారా లేక రాష్ట్ర ప్రజల సంరక్షణ కోసం పని చేస్తున్నారా?" అని జనసేన పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నెలలో అధికారం కోల్పోయే పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే రాబోయే కాలంలో దాని పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.



సీసీ కెమెరాల ఏర్పాటు

కంకిపాడు: కుందేరులో దాతల సహకారంతో సీసీ కెమెరాలను గురువారం ఏర్పాటు చేశామని ఎస్సై సందీప్ తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.



నెప్పల్లిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీలో పాల్గొన్న బోడే హేమ, పెనమలూరులో దేవినేని గౌతమ్, స్మిత దంపతులు, బాపులపాడులో టీడీపీ, జనసేన నాయకులు

అప్పుల ఆంధ్రగా రాష్ట్రం

చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రానికి భవిష్యత్: బోడె హేమ

కంకిపాడు, మార్చి 7: అప్పుల ఆంధ్రగా మార్చి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన ఘనుడు సీఎం జగన్‌రెడ్డి అని, ఆయనను ఇంటికి పంపి వెలుగులు నింపే చంద్రబాబును సీఎంను చేసేందుకు అందరు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ పిలుపునిచ్చారు. నెప్పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక పరిశ్రమ కూడా రాలేదన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్ చంద్రబాబుతోనే ఉందన్నారు. టీడీపీ- జనసేన కూటమిని బలపర్చాలని నియోజకవర్గంలో టీడీపీ జెండా రెపరెపలాడాలని ప్రజలను కోరారు. కొలుసు గోవింద రావు, కొలుసు రాజేశ్వరి, సంగెపు రంగారావు, కోలవెన్ను శివరాం, కోలవెన్ను ఉషారాణి, ఈడ్పుగంటి నాని, లోయ జోజిబాబు, చింతపల్లి కోటేశ్వరరావు, కోలవెన్ను గోపీచంద్, ఎ.నాని పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

పెనమలూరు: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయఢంకా మోగించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత దంపతులు పేర్కొన్నారు. పెనమలూరు చెరువుకట్ట 11వవార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, నిరుద్యోగయువత, మహిళల వెతలు అన్నీ ఇన్నీ కావని వారు అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని వారు పిలుపునిచ్చారు. షేక్ శివయ్య, వెంకన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

కూటమికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

హనుమాన్‌జంక్షన్: వైసీపీ అరాచకపాలనపై ప్రజలు విసుగెత్తిపోయి ఉన్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి అన్నారు. గురువారం టీడీపీ బాపులపాడు పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలోని ఎన్టీఆర్‌నగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంపై ఆమె ప్రచారం నిర్వహించారు. టీడీపీ- జనసేన కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని ప్రచారం చేశారు. గార్లపాటి రాజేశ్వరరావు, గుమ్మడి శేషగిరిరావు, కడవకొల్లు రాజేష్, నాగరాజు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

బీసీ డిక్లరేషన్‌పై సంబరాలు

హనుమాన్‌జంక్షన్: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆ పార్టీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. జయహో బీసీ సభలో చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై జరుపుతూ గురువారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు మూల్పూరి సాయి కల్యాణి, వడ్డిల్లి లక్ష్మి, అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, వీరమాచనేని బుజ్జి, కాకుల శ్రీను, అచ్చన వెంకటేశ్వరరావు, జనసేన నేతలు వడ్డి శివ నాగేశ్వరరావు, అహ్మద్, భూక్యా సమీర్, వడ్డి భార్గవ్, శిరీష, జయరాణి, సూర్యావతి పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7: తిప్పనగుంట పీఏసీఎస్ కార్యాలయ ఆధునీకరణ, రెండో అంతస్తు నిర్మాణానికి తన తాత మూల్పూరు వెంకటరెడ్డి(మాజీ సర్పంచ్), లక్ష్మీదేవమ్మ జ్ఞాపకార్థం పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్ రూ.2.50లక్షల విరాళమిచ్చారు. సీఈవో లోకేశ్వరరావుకు గురువారం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేతులమీదుగా ఆ నగదున అందజేయించారు. సర్పంచ్ కలపాల భీమయ్య, కాకాని బాలరామకృష్ణ, మొవ్వా సురేష్, ముల్లంగి శ్రీధర్, శివాజీ పాల్గొన్నారు.













పాడిరైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 7: అత్యధిక పాల సేకరణ ధర, ఏడాదికి మూడుసార్లు బోనస్ చెల్లిస్తూ పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ పనిచేస్తోందని చైర్మన్ చలసాని అంజనేయులు అన్నారు. ఉమామహేశ్వరపురం, వీరవల్లి పాలసొసైటీలను గురువారం ఆయన సందర్శించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు మేలుజాతి పశువుల కొనుగోలుకు యూనియన్ సహకార మందిస్తోందన్నారు. దాణా, పచ్చిగడ్డి విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు యూనియన్ నుంచి రైతులకు కావాల్సిన సహకారంపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్, సంఘ అధ్యక్షుడు నిరంజనరావు, పాలకవర్గ సభ్యులు, పాడిరైతులు పాల్గొన్నారు.



ఉషారామాలో డీఎస్పీ డాక్టర్ శ్రీవేదను సత్కరిస్తున్న మహిళా అధ్యాపకులు, ఉయ్యూరులో మహిళలను సత్కరిస్తున్న నూకల సాంబశివరావు, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఉద్యోగులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఉంగుటూరు, మార్చి 7: మహిళల అభ్యున్నతితోనే సమాజ అభివృద్ధి ముడిపడి ఉందని, మగవారికి దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆకాంక్షించారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. కళాశాలలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డీఎస్పీకి మహిళా అధ్యాపకులు మెమెంటో అందించి సన్మానించారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డైరెక్టర్ కె.రాజశేఖరరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో తన తల్లి నూకల వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం మహిళలు, కళాశాల విద్యార్థినులను సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావు సత్కరించారు. ఉయ్యూరు సీహెచ్‌సీ అధికారి జి.తేజస్వి, చెరకు పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డి.సుధారాణి, పడమట భువనేశ్వరీదేవి, ఎం.శాంతిని సత్కరించారు. ప్రిన్సిపాల్ వి.శ్రీరాం, వినయ్‌కుమార్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బాలికా విద్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉప ప్రధానోపాధ్యాయురాలు కె.జ్యోత్స్న అధ్యక్షతన నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో వృత్తి విద్య శిక్షణ కోర్సులకు చెందిన వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు రాష్ట్ర బాలిక విద్య అభివృద్ధి అధికారి భారతి బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.అనూష కాంతి, ఇతర మహిళా ఉద్యోగులను క్లబ్ క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్ సత్కరించారు.

విజయవాడ రూరల్: నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని పాఠశాల పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, ఫణికుమార్, చిగురుపాటి లక్ష్మి పాల్గొన్నారు.





పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పరీక్ష కిట్లు అందజేత

గన్నవరం, మార్చి 7: విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని రోటర్లీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్ కుమార్ తెలిపారు. మండలంలోని 9 హైస్కూళ్లు, ప్రభుత్వ ఇంటర్ కళాశాల, అత్కూరు జడ్పీహైస్కూల్‌తో కలిపి 750 మంది విద్యార్థులకు రూ.లక్ష విలువైన పరీక్ష కిట్లను గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం, చిన అవుటపల్లి పుణ్య చారిటీస్ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో అందజేశారు. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వస్తాయని తెలిపారు. కార్యదర్శి నర్రా సీతారామారావు రోటేరియన్లు గన్నే వెంకట్రావు, టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, చింతపల్లి సీతారామయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.




సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

లక్ష్యసాధనకు పట్టుదల, కృషి అవసరం

భాష్యం బ్లూమ్స్ ద్వితీయ వార్షికోత్సవంలో వక్తలు

గుంటూరు(విద్య), మార్చి 7: క్రమశిక్షణ, పట్టుదల, కృషితో ఎంతటి లక్ష్యాన్నైనా సునాయాసంగా సాధించవచ్చని ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పోరంకి భాష్యం బ్లూమ్స్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు భాష్యం ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్ అధ్యక్షత వహించారు. నేటి విద్యా విధానంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులపై ఒత్తిడి లేకుండా బోధన అందించాలని శ్రీనివాసరావు సూచించారు. విలువలు, నైతికత, క్రమశిక్షణ, విశ్వసనీయతకు పెట్టింది పేరు భాష్యం విద్యాసంస్థలని, ఉత్తమ విద్యా విధానంతో పాటు విలువలను నేర్పిస్తూ భావి భారత పౌరులను తీర్చిదిద్దాలని సినీ దర్శకుడు ఓంకార్ సూచించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి రేడియాలజిస్ట్ డాక్టర్ కరిష్మారెడ్డి, భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, భాష్యం బ్లూమ్స్ జెడ్‌ఈవో వరలక్ష్మి, విజయవాడ జేడీవో జోషి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు, మార్చి 7: ముదునూరులో రెండురోజుల క్రితం అగ్నిప్రమాదం కారణంగా ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన పర్తిపాటి భానుకు తెలుగుయువత ఆధ్వర్యంలో గురువారం నిత్యావసరాలు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి శరత్, జ్ఞానశేఖర్, రామకోటయ్య, కలపాల ఫణి పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవండి

గన్నవరం, మార్చి 7: పాఠ్యాంశాలను ఏకాగ్రతగా చదవటంతో పాటు పబ్లిక్ పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకు తగినట్లు కచ్చితమైన జవాబులు రాయటం ఎంతో ముఖ్యమని వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు పది రోజుల గడువు ఉందని రోజూ 35నిమిషాల పాటు పలు ప్రశ్నలకు జవాబులు రాయటం సాధన చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.రూన్సీరాణి పాల్గొన్నారు.









బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

అందరికీ అందుబాటులో ఉంటా : వెనిగండ్ల రాము



నందివాడ (నరసింహపురం), మార్చి 7 : ప్రజా సమస్యల పరిష్కారానికి అందరికీ అందుబాటులో ఉంటానని నియోజకవర్గ ఇంచార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం గురువారం లక్ష్మీనరసింహపురం గ్రామంలో నిర్వహించారు. గ్రామస్థులు వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లను గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు.



గద్దె అనురాధను సత్కరిస్తున్న కొల్లు నీలిమ



పద్మావతి కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



గుడ్లవల్లేరులో డాక్టర్ సుగుణావతికి సత్కారం



అవనిగడ్డలో అధ్యాపకులకు సత్కారం



బంటుమిల్లిలో అధ్యాపకులకు సత్కారం

చైతన్యంతోనే మహిళా సాధికారత

• అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో వక్తల ఉద్ఘాటన

మచిలీపట్నం టౌన్, మార్చి 7 : మహిళలు చైతన్యవంతులై అన్నిరంగాల్లోనూ రాణించాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. కొల్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లు నీలిమ అధ్యక్షతన కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లలిత కన్వెన్షన్ హాలులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో గద్దె అనురాధ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొల్లు నీలిమ ఆధ్వర్యంలో గద్దె అనురాధ, కవితా బ్యాంకు చైర్మన్ కవిత తదితరులను ఘనంగా సత్కరించారు. మహిళలు విద్యావంతులయితేనే దేశాభివృద్ధి జరుగుతుందని ఐఏఎస్ అకాడమీ చైర్మన్ దిట్టకవి వెంకటేశ్వరరావు అన్నారు. పరాసుపేట మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాలికల ఉచిత హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. అన్నపూర్ణ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ షిప్లా, పద్మావతి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ, ఎస్‌వి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. విజయ మాధవిలను కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ సత్కరించారు. నోబుల్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ ఆధ్వర్యంలో ఏడుగురు విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరకృష్ణ, పద్మావతి మహిళా హిందూ కళాశాల విశ్రాంత బోటనీ విభాగాధిపతి ఏ.వి.సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎల్. సుశీల, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, రామశేఖరరెడ్డి, అనుపమ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు. మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మేయర్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. డాక్టర్ పట్టాభి మెమో రియల్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో గుడిపూడి రాధికారాణికి నారీశక్తి పురస్కారం అందచేశారు. యూనియన్ బ్యాంకు సీనియర్ మేనేజర్ విజయభారతి, బ్రహ్మకుమారీస్ కవిత తదితరులు పాల్గొన్నారు. **పెడన** : పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలను కెవైఎస్ఎస్ సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. **అవనిగడ్డ రూరల్** : పురుషులతో సమానంగా మహిళలు పురోగమించాలని సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణి .పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీడీవో మరియకుమారి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సతీమణి కెప్టెన్ లక్ష్మీ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి విజయ కల్యాణిని సత్కరించారు. **గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు వి.వి.ఐ.పి.ఎస్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో జరిగిన వేడుకల్లో గుడివాడ ఏరియా ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ చింతపల్లి సుగుణావతిని ఘనంగా సత్కరించారు.పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీచర్లను సన్మానించారు. ఎంఈవో జగన్మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కోడూరు** : మండల వెలుగు కార్యాలయంలో జెపామ్ సర్వీస్ ఆధ్వర్యంలో సమైక్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐ శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పద్మ ప్రియ, ఈవోపీఆర్డీ నాగరేవతి, పాల్గొన్నారు. **అవనిగడ్డ** : ఎస్.వి.ఎల్.క్రాంతి కళాశాలలో కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు అధ్యాపకులను, సిబ్బందిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ హరిత కౌమార దశలో ఉన్న విద్యార్థినులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహ న కల్పించారు. పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మహిళా సాధికార విభాగాధిపతి రత్నకుమారి, బాదర్ల సత్యనారాయణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 15 మంది మహిళల ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్‌కుమార్, యుటీఎఫ్ అధ్యక్షురాలు సీహెచ్ మైథిలి, ప్రధాన కార్యదర్శి ఎం విజయశ్రీ, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్ పాల్గొన్నారు. **బంటుమిల్లి** : ప్రభుత్వ డిగ్రీ కాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్మోహనరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు హిమాలినీదేవి, సుజాత, జోత్స్నలను ఘనంగా సన్మానించారు.



తోట్లవల్లూరు ఆదర్శ పాఠశాలలో వివిధ రంగాల మహిళలను సత్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు



బీసీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేస్తూ కృత్తివెన్ను, మొవ్వ, పమిడిముక్కల, అవనిగడ్డలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం

కృత్తివెన్ను/ పెడన : బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన, కృత్తివెన్నులలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. **కూచిపూడి** : మొవ్వ, గూడపాడు గ్రామాలో కుమార్ రాజా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకటించటం పట్ల చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు బీసీ నేతలతో కలసి పాలాభిషేకం నిర్వహించారు. **పమిడిముక్కల**: బీసీ డిక్లరేషన్‌కు కృజ్ఞతగా పమిడిముక్కల టీడీపీ కార్యాలయం వద్ద గురువారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చే శారు. **మోపిదేవి** : మోపిదేవి టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. **అవనిగడ్డ** : బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకమైనదని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.**తోట్లవల్లూరు** : బస్టాండ్ సెంటర్లో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాలభిషేకం చేశారు.

ఘనంగా బండ్రెడ్డి రామకృష్ణ జన్మదిన వేడుకలు



అవనిగడ్డ : ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ జన్మదిన వేడుకలు అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని బండ్రెడ్డి రామకృష్ణకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. యాసం చిట్టిబాబు, బండే శ్రీనివాస్, కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్, అందె శ్రీరామచంద్రమూర్తి, చిరంజీవి అభిమాన సంఘ నేత అప్పికట్ల తారక మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బిళ్లపాడులో వెనిగండ్ల రాము సేవలు



గుడివాడ రూరల్ : వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము రూ.60 వేలతో సమకూర్చిన రెండు ఇస్త్రీ బండ్లు, రెండు ఇస్త్రీ పెట్టెలు, ఒక కూరగాయల బండిని గుడివాడ మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీకృష్ణ పేదలకు బిళ్లపాడులో అందజేశారు. నాయకులు కర్రే వెంకటగిరి, అవ్వారు కిరణ్, వేములపల్లి భవాని, మెండు జోజిబాబు, గొరిపర్తి నాగేశ్వరరావు, ఆరేపల్లి నాంచారయ్య, నాంచారయ్య, తిరుపతమ్మ, నిమ్మగడ్డ నాగశాస్త్రి, అశోక్, నాగమల్లేశ్వరరావు, పైడియ్య, వెంకటేశ్వరరావు, శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసుల వైఖరికి జనసేన ఖండన

అవనిగడ్డ : మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పని చేసే సిబ్బంది, పవన్ కల్యాణ్ వ్యక్తిగత సిబ్బంది నివశిస్తున్న అపార్ట్‌మెంట్‌లో పోలీసులు సోదాలు నిర్వహించడాన్ని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు ఖండించారు. అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న వాచ్‌మెన్‌ను, అతని భార్యను పోలీసులు అసభ్య పదజాలంతో దూషిస్తూ సిబ్బందిని రివాల్వర్‌తో బెదిరించటం దారుణమన్నారు. పోలీసులు తీరు మార్చుకోకపోతే పోలీస్ స్టేషన్ల ముందు నిరసన తెలియజేస్తామన్నారు.



ఘనంగా విద్యాలయ వార్షికోత్సవం

గుడివాడ : విద్యాలయ ఇంగ్లీషు మీడియం పాఠశాల 18వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కమ్మవారి సత్రంలో జరిగిన వేడుకలను న్యాయమూర్తి దేవు నరసింహారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పాఠశాల డైరెక్టర్లు బొప్పన విజయభాస్కర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రా రంభించారు. బహుమతులను సాధించిన విద్యార్థులను సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



నైతిక విలువలు కలిగిన విద్య అవసరం

పామర్రు : నైతిక విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంఈవో జి. పద్మవాణి అన్నారు. ఏఎస్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పరీక్షలంటే భయాన్ని వీడి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు పదోతరగతి విద్యార్థులకు బహూమతిలిచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్యామ్యూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల్లో పచ్చదనానికి ప్రాధాన్యం

పామర్రు : పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించడం కోసం విద్యాలయాల యాజమన్యాలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ సమితి పర్యవేక్షణ అధికారి జిప్రభ.అన్నారు. పామర్రు ఏఎస్ఎం, జుఝ్జువరం ఉషోదయ ఉన్నత పాఠశాలల్లో పచ్చదనం-పర్యావరణ అంశాలను జిల్లా కోఆర్డినేటర్ అన్నపూర్ణతో కలిసి ఆమె పరిశీలించారు. మానవునికి ప్రాణవాయువు అందించే మొక్కల పెంపకానికి కృషి చేసి కాలుష్య రహిత సమాజ స్థాపనకు దోహదపడాలన్నారు. ప్రిన్సిపాల్స్ ఎండిరఫీ, పూర్ణచంద్రరెడ్డి, ఎంఈవో పద్మవాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సేవ భగవంతుడి సేవతో సమానం

పామర్రు : దివ్యాంగులకు సేవ భగవంతుని సేవతో సమానమని ఐఏఎస్ అకాడమీ చైర్మన్ దిట్టకవి వెంకటేశ్వరరావు అన్నారు. ఎలకుర్రు కేడీబీ మానసిక దివ్యాంగుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. కెడిబి ట్రస్టు వారు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్టుకార్యదర్శి కాశీనాదుని నాగేశ్వరరావు, బందరు పద్మావతి హిందూమహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ తలశిలదామోదర్, అశోక్, వసుందర శాస్త్రి పాల్గొన్నారు.

సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగాయలంక : గంగాపార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలను చేయించి పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలను చేసే ఘట్టాన్ని ఆలయ అర్చకుడు కొల్లిపర శివ సాయి తిరుమల భార్గవ్, సుబ్బారావు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొక్కిలిగడ్డ విజయభాస్కర్ దంపతులు, శీలం అశ్విన్ కుమార్ - కృష్ణ ప్రభ దంపతులు పీటల మీద కూర్చొని పూజలు నిర్వహించారు.

కలిసి పనిచేద్దాం.. వైసీపీని ఓడిద్దాం

●జనసేన నేత బండి రామకృష్ణతో భేటీలో కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 7 : టీడీపీ, జనసేన పొత్తుతో మచిలీపట్నంలో వైసీపీ అభ్యర్థి చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర భేటీ అయ్యారు. ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచార ప్రణాళిక రూపొందించడంపై చర్చించారు. నియోజకవర్గంలో వైసీపీ పట్ల పూర్తి స్థాయిలో వ్యతిరేకత ఉందన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించి మేనిఫెస్టోలో పొందుపర్చాలని నిర్ణయించారు. అధికారంలోకి వచ్చిన తరు వాత మలకాపట్నంలో మదరసా భవనం నిర్మిస్తామని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. గురువారం రాత్రి మలకాపట్నంలో మదరసా సభ్యులు షేక్ బాజానీ, ఎండి ఆరీఫ్‌ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రవీంద్ర, కొనకళ్ల మాట్లాడారు. ఆలీ ముస్తాఫా, అబ్దుల్ ఆలీం, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత పాల్గొన్నారు.